క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా అందజేత

రేపల్లెరూరల్: పట్టణంలోని సీతారామయోగిని కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 11 గంటలకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ పర్యవేక్షణలో నిర్వహించే కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొనాలని కోరారు.

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

కర్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత పంపిణీ కార్యక్రమం కర్లపాలెంలో ఆదివారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఏఎంసీ శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు వేర్వేరు ప్రకటనల్లో శనివారం తెలిపారు. ఈ సభకు ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరై ఆసరా నగదు చెక్కు డ్వాక్రా మహిళలకు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి డ్వాక్రా మహిళలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పేర్కొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత



కర్లపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం సహాయ నిధి వైద్యానికి దోహదపడుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండలంలోని కట్టావాద గ్రామానికి చెందిన గొట్టిముక్కల రాజుకు రూ.4లక్షలు, బత్తులవానిపాలేనికి చెందిన చిమటా సుందరయ్యకు రూ.45వేలు సీఎం సహాయనిధి నగదు చెక్కులను ఆయన శనివారం తమ స్వగృహంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం, సీఎం సహాయ నిధి ద్వారా ఎంతో మందికి ఖరీదైన వైద్యం ఉచితంగా అందజేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, గోవతోటి సుబ్బారావు ఉన్నారు.

జూదరుల అరెస్ట్

చెరుకుపల్లి: పేకాట ఆడుతున్న ముగ్గురిని రాంబొట్లవారిపాలెం గ్రామంలో శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ సురేష్ వివరాల మేరకు.. గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,050ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ చెప్పారు.

సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తం

- ముగిసిన ఓటర్ల గణాంకాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- రేపల్లె నియోజకవర్గంలో పెరిగిన మహిళా ఓటర్లు
- నిజాంపట్నంలో పురుషుల ఓట్లు అధికం
- నగరం మండలంలో నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటు



రేపల్లె పట్టణ వ్యూ

రేపల్లెరూరల్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అధికారులు రేపల్లె నియోజకవర్గంలో అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే రెండు అంకాలు ముగించారు. ఓటర్ల గణాంకాలు పూర్తవ్వటంతో, పోలింగ్ కేంద్రాలను, ఈవీఎం మిషన్ భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ లను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేశారు. ఎన్నికల అధికారులు ప్రకటించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం రేపల్లె నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,26,566 ఓటర్లు ఉండగా ఇందులో 1,11,071 మంది పురుషులు, 1,15,475 మంది స్త్రీలు, 20 మంది ఇతరులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పురుషులకంటే మహిళా ఓటర్లు 4,404 మంది అధికంగా ఉన్నారు. దీంతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓట్లు కీలకం కానున్నాయి.

పెరిగిన ఓటర్లు, పోలింగ్ కేంద్రం

గత 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో పోలిస్తే ప్రస్తుతం ఓటర్ల జాబితాల్లో 8,644 మంది ఓటర్లు పెరిగారు. గతంలో 2,17,922 ఓటర్లు ఉండగా ప్రస్తుత జాబితాలో 2,26,566 ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికల్లో 263 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రస్తుత ఎన్నికలకు 264 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. నగరం మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌లో కొత్తగా పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు.

మండలాల వారీగా ఓటర్లు ఇలా..

ఇటీవల ఎన్నికల అధికారులు ప్రకటించిన ఓటర్ల వివరాలు మండలాల వారీగా ఇలా ఉన్నాయి.

- రేపల్లె పట్టణంలో మొత్తం ఓట్లు 37,084. వీటిలో 17,575 మంది పురుషులు, 19,497 మంది స్త్రీలు, 12 మంది ఇతరులు ఉన్నారు. 35 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.
- అదేవిధంగా రేపల్లె రూరల్‌లో 48,398 ఓటర్లు ఉండగా.. 24,039 మంది పురుషులు, 24,359 మంది స్త్రీలు ఉన్నారు. 61 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.
- నగరం మండలంలో 42,256 మంది ఓటర్లు ఉండగా అందులో 20,720 మంది పురుషులు, 21,533 మంది మహిళలు ఉన్నారు. 54 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.
- నిజాంపట్నం మండలంలో 49,931 మంది ఓటర్లు ఉండగా 25,002 మంది పురుషులు, 24,929 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 54 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.
- చెరుకుపల్లి మండలంలో 48,897 మంది ఓటర్లు ఉండగా 23,735 మంది పురుషులు, 25,157 మంది స్త్రీలు ఉన్నారు. 60 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.
- నియోజకవర్గంలోని అన్ని మండలాలలో మహిళల ఓట్లు అధికంగా ఉండగా నిజాంపట్నం మండలంలో పురుషుల ఓట్లు మహిళా ఓట్ల కంటే 73 అధికంగా ఉన్నాయి.

ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే కోన రఘుపతి



మరుప్రోలువారిపాలెంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రఘుపతి

బాపట్ల: రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. శనివారం మరుప్రోలువారిపాలెం, అసోదివారిపాలెం గ్రామాల్లో పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల గుండె చప్పుడు తెలిసిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని పేర్కొన్నారు. మరుప్రోలువారిపాలెం, అసోదివారిపాలెం గ్రామాలు బైపాస్ రోడ్డును నాలుగు లేన్ల రహదారిగా చేయటంతో ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పార్టీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, నాయకులు రావివెంకన్న, కొండలరెడ్డి, చేజర్ల నారాయణరెడ్డి, నక్కా వీరారెడ్డి, నర్రావుల వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన పెంచుకోవాలి



శిక్షణ పుస్తకాలు ఆవిష్కరిస్తున్న డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు

బాపట్ల: ప్రత్యామ్నాయ పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ కళాశాల డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాల బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థులు అనుభవ పూర్వక అభ్యాస కార్యక్రమం (ఈఎల్‌పీ)లో భాగంగా సాగు చేసిన అజోల్లా, పుట్ట గొడుగుల పెంపకం విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. డీన్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అజోల్లా, పుట్టగొడుగుల పెంపకంతో అధిక లాభాలను పొందవచ్చని తెలిపారు. పశువులకు మేతగా, పంటకు జీవన ఎరువుగా అజోల్లా ఉపయోగపడుతుందన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు, గర్భిణీ స్త్రీలు, పోషక లోపంతో బాధపడే చిన్న పిల్లలకు పుట్టగొడుగులు ప్రత్యామ్నాయ పోషకాహారంగా దోహదపడుతుందన్నారు. అజోల్లా, పుట్టగొడుగుల సాగుపై విద్యార్థులు తయారు చేసిన కరపత్రాన్ని ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు. డాక్టర్ ఎ.విజయగోపాల్, డాక్టర్ ఎం.రమాదేవి, డాక్టర్ బి.హెచ్.శర్వాణి, ప్రొటెక్షన్ ఎన్‌జీఓ చీరాల కార్యదర్శి చెంగ్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మురుగు కాల్వను పరిశీలిస్తున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

బాపట్ల అర్బన్ : ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బాపట్ల మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణ పరిధిలోని 4, 5 వార్డుల్లో దైతావారి వీధిలో శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఇంటి వద్దనే తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసి కంపోస్టు తయారు చేసి ప్రజలు అందించాలన్నారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. వార్డులోని ప్రజలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారు. కమిషనర్ వెంట ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ ఉమా మహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నజీర్, ఉదయ్ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు



భట్టిప్రోలు: బదిలీ అయిన మండల తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావును శనివారం కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యాలయంలో టైపిస్ట్‌గా పనిచేస్తున్న మహేష్ ఆర్ఐగా ఉద్యోగన్నతి పొందారు. రిపబ్లిక్ డే సందర్భంగా అవార్డులు అందుకున్న వీఆర్వోలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీసీపీఎస్ఏ జిల్లా కోశాధికారి గుర్రం మురళీ మోహన్, ఇన్‌చార్జ్ ఆర్ఐ వీఆర్వోలు పాల్గొన్నారు.

7న షర్మిల బాపట్ల పర్యటన

మాజీ కేంద్రమంత్రి జేడీ శీలం

బాపట్ల అర్బన్: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈ నెల 7న బాపట్ల లో పర్యటించనున్నట్లు మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం తెలిపారు. పట్టణంలోని అన్నం సతీష్ కాపు కల్యాణ మండపంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీసీసీ పదవి చేపట్టిన తరువాత షర్మిల మొదటి సారిగా జిల్లాకు వస్తున్నట్లు చెప్పారు. ఆమె పర్యటనను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. గన్నవరం నుంచి నేరుగా బాపట్లకు ఆమె చేరుకుంటారని, కొత్త బస్టాండ్ చీలు రోడ్ సెంటర్‌లో సాయంత్రం 4గంటలకు ఘన స్వాగతం పలకనున్నట్లు చెప్పారు. అక్కడి నుంచి అంబేడ్కర్ బొమ్మ వరకు రోడ్ షో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంట, పట్టణ అధ్యక్షుడు దోనేపూడి దేవరాజ్, మండలాధ్యక్షుడు పల్లపట్ల శంకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్వీఆర్ కుమార్, మాజీ కౌన్సిలర్ బక్క రోశయ్య, పోల్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, అమ్మనుల్లా బేగ్, దోనేపూడి రవి, శీలం సాగర్ పాల్గొన్నారు.

డాక్టర్ ఇనజకుమారి సేవలు అభినందనీయం

బాపట్ల అర్బన్: మరణానికి చేరువైన వారిని కూడా బతికించగలిగే శక్తి వైద్యులకే ఉందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య అన్నారు. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం బ్యాంకు కాలనీలో ఇనజకుమారి వైద్యశాలలో శనివారం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల నుంచి ఎంతో మంది పేద ప్రజలకు విశేష సేవలందించిన డాక్టర్ ఇనజకుమారి అభినందనీయులన్నారు. ఆమెను నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కంకణాల బాలమ్మ శాలువా కప్పి, సన్మానించారు. డాక్టర్ ఇనజకుమారి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి బీసీ సంక్షేమ సంఘం తనను సన్మానించడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సలహాదారు అంగలకుదురు నటరాజన్, జిల్లా కార్యదర్శి మారం రవికుమార్, ఎస్ఎస్పీ రాజు, డాక్టర్ ఫణికుమార్, శైలజ, బుల్లి బాబు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్‌కుమార్ నియామకం

భట్టిప్రోలు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పి.అనిల్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఏపీఓ పి. శివపార్వతి నియామకపు పత్రాన్ని ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేబీవీ మల్లికార్జునరావు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

నేటి నుంచి మంచినీటి సరఫరా



బాపట్ల అర్బన్ : బాపట్ల పురపాలక సంఘం పరిధిలో నేటి నుంచి మంచి నీరు రోజు మార్చి రోజు సరఫరా అవుతుందని బాపట్ల మున్సిపాలిటీ డీఈ శ్రీనివాసులు శనివారం తెలిపారు. పీటీ చానల్ నుంచి రావాల్సిన నీరు సాంకేతిక కారణాలవల్ల రాలేదని చెప్పారు. అందువల్ల మంచినీటి చెరువులో నీటి కొరత ఏర్పడిందని వెల్లడించారు. క్లోరినేషన్ చేసి నీరు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు మంచినీటిని వృథా చేయొద్దని కోరారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ చలం

తెనాలి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం శనివారం రాత్రి వెల్లడించారు. మండలంలోని కోపల్లెకు చెందిన బాణావత్ నాగమల్లేశ్వరరావు 40 మద్యం సీసాలను బైక్‌లో తరలిస్తూ జగ్గడిగుంటపాలెం వద్ద పట్టుబడ్డాడు. సీసాలను స్వాధీనం చేసుకుని, బైక్‌ను సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మరో ఘటనలో తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలో అంగలకుదురుకు చెందిన బొల్లు రవి మద్యం విక్రయిస్తుండగా త్రీ టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు అరెస్టు చేశారు.